క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేత సన్యాసిరావు



సన్యాసిరావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం : మల్కాపురం గాంధీజీవీధికి చెందిన సీనియర్ టీడీపీ కార్యకర్త అంజూరి సన్యాసిరావు వైఎస్సార్‌సీపీ చేరారు. 59వ వార్డు నక్కవానిపాలెం పార్టీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో 62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు, ఆ ప్రాంత వైఎస్సార్‌సీపీ నాయకుడు సర్వసిద్ధ పైడిబాబుల సమక్షంలో పార్టీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ కండువా వేసి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో విశాఖ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీని, పశ్చిమ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు.

పశ్చిమలో ఒకే నామినేషన్



ఆర్వో హుస్సేన్ సాహెబ్‌కు నామినేషన్ దాఖలు చేస్తున్న చాణక్య దొర

కంచరపాలెం: విశాఖ పశ్చిమ నియోజకవర్గం -24 జ్ఞానాపురం జోన్-5 జోనల్ కార్యాలయం ఎన్నికల విభాగంలో సోమవారం ఒక నామినేషన్ మాత్రమే దాఖలైనట్టు ఎన్నికల విభాగాధికారులు తెలిపారు. నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా హనుమంత్ చాణక్య దొర ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసినట్లు పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) హుస్సేన్ సాహెబ్ తెలిపారు. ఇప్పటి వరకు పశ్చిమ ఐదు నామినేషన్లు దాఖలైనట్టు చెప్పారు.

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్య స్వామి రథోత్సవం



సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకున్న కె.కె.రాజు, ధర్మకర్త దేవాల రాజు

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో కార్తికేయ శరవణ ట్రస్టు ఆలయ ధర్మకర్త దేవాల రాజు(కృష్ణ) ఆధ్వర్యంలో సోమవారం చైత్రమాస బహుళ పూర్ణిమ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామకృష్ణ శర్మ నేతృత్వంలో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు, కలశాభిషేకం, సహస్రనామ విభూది పుష్పాలతో అర్చనలు చేశారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. మాలధారులు శూలాలు వేసుకుని వేల్‌వేల్ మురుగన్ అంటూ రథోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊర్వశి కూడలి నుంచి జాతీయ రహదారిలో కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన మీదుగా రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. జాతరలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చొక్కాకుల కుమారి, కడగల జ్యోతిష్, కార్యదర్శి కాండ్రేగుల రాము, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై అప్పన్న

సింహాచలం: సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. నాలుగోరోజు సోమవారం స్వామివారికి సూర్యప్రభ వాహనంపై తిరువీధి విశేషంగా జరిగింది. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామితో పాటు శ్రీదేవి, భూదేవిలను అలంకరించి సూర్యప్రభ వాహనంపై అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధిని వైభవంగా నిర్వహించారు.

‘పది’మందీ మెచ్చుకొనేలా..

పేదరికం చదువుకు అడ్డుకాదని పలువురు విద్యార్థులు నిరూపించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉత్తమ మార్కులు సాధించారు. ‘పది’మందీ మెచ్చుకొనేలా ఉత్తీర్ణత సాధించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన సదుపాయాలను విద్యార్థులు పూర్తిగా సద్వినియోగం చేసుకున్నారు. ఉపాధ్యాయుల కృషికి..విద్యార్థుల సంకల్పం తోడై పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. కార్పొరేట్ స్కూళ్లకు ఏమాత్రం తీసిపోకుండా గర్వంగా తలెత్తుకొనేలా చేశారు. జగన్ మావయ్య ఆశయాలను నెరవేర్చారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు
- జగన్ మావయ్య కలలు సాకారం చేశామన్న విద్యార్థులు
- పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధన, మౌలిక సదుపాయాలు
- ఉత్తమ ఫలితాలకు అవే కారణాలంటున్న విద్యాకుసుమాలు
- అత్యధికంగా 589 మార్కులు సాధించిన బాలికలు

గోపాలపట్నం : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతిలో టాప్‌లేపారు. జగన్ మామయ్య కలలను సాకారం చేశామని గర్వంగా చెబుతున్నారు. పాఠశాలల అభివృద్ధి, సౌకర్యాల కల్పన, విద్యా బోధనలో మార్పులు, ఉపాధ్యాయుల సమష్టి కృషితో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించామని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉత్తీర్ణ త శాతం బాగా పెరిగింది. గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 249 మంది పరీక్షలు రాయగా 205 మంది ఉత్తీర్ణులయ్యారు. పంగ కీర్తి మేఘన, రావాడ గీత అత్యధికంగా 589 మార్కులు సాధించారు. లంకా ప్రసన్న 569 మార్కులు సాధించింది. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 222 మంది పరీక్షలు రాయగా 167 మంది ఉత్తర్ణీత సాధించారు. బి.సత్యప్రహర్ష 580 మార్కులు సాధించగా, ఎ.ఆనంద్ గణేష్ 571మార్కులు సాధించిన సాధించాడు. హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 56 మంది పరీక్షలు రాయగా 48 మంది పాసయ్యారు. ఎస్.వివేక్ 584 మార్కులు, ఎస్.శివ 552 మార్కులు, వి.హరీష్ 524 మార్కులు సాధించారు. యల్లపువాని పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 77 మంది పరీక్షలు రాయగా 73 మంది పాసయ్యారు. బి.గౌతమ్ 577 మార్కులు, పి.ప్రజ్ఞ 556 మార్కులు సాధించారు. కొత్తపాలెం జిల్లా పరిసత్ ఉన్నత పాఠశాలలో 48 మంది పరీక్షలు రాయగా 44 మంది ఉత్తీర్ణత సాధించారు. బి. తరుణ్ కుమార్ 552మార్కులు, నాగ చైతన్య 524 మార్కులు సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. మేహాద్రి గెడ్డ ఆంధ్రప్రదేశ్ ఉమెన్స్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 70 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 69మంది ఉత్తీర్ణత సాధించారు. బండారు గంగ ప్రతిభ 579 మార్కులు, టి.గౌతమి 559, చపల దీపిక 555 మార్కులు సాధించారు. 500 పైబడి మార్కులు 18 మంది సాధించారు.

మల్కాపురం : జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్ననత పాఠశాల నుండి 118 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలను రాశారు. వీరిలో 70 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్ రాగా,24 మందికి సెకెండ్ క్లాస్ వచ్చింది.7 గురు విద్యార్థులు థర్డ్ క్లాస్ రాగా,17 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. బి.లోకేష్‌కు 582 మార్కులు రాగా..జగదీశ్వరికి 580 మార్కులు సాధించింది. పి.వెంకటేష్‌కు 566 మార్కులు సాధించారు. 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల నుండి 241 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వీరిలో 219 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 168 మంది ఫస్ట్ క్లాస్ సాధించగా, 34 మంది సెకెండ్ క్లాస్ సాధించారు. 17 మంది విద్యార్థులు థర్డ్ క్లాస్‌లో పాసయ్యారు. అల్లు జశ్వంత్‌కు 588 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథముడిగా నిలిచాడు. శ్రీశాంత్ 575 మార్కులతో, నిఖిల్ 575 మార్కులు సాధించారు. బి. హర్షిత 573 మార్కులు సాధించింది. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆయా పాఠశాల ప్రధానోసాధ్యాయులు, ఉపాధ్యాయులు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. మల్కాపురం పాఠశాల వద్ద సోమవారం సాయింత్రం జరిగిన కార్యక్రమంలో పాఠశాల నుంచి అత్యధిక మార్కులు సాధించిన జశ్వంత్‌ను హెచ్‌ఎం రమణికుమారి అభినందించారు. అలాగే మిగిలిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



రావాడ గీత (589మార్కులు) స్వీట్ తినిపిస్తూ..



సత్యప్రహర్ష (580 మార్కులు)



ఆనంద్ గణేష్ (571 మార్కులు)



వివేక్ (584 మార్కులు)



తరుణ్ కుమార్ (552 మార్కులు)

సత్తా చాటిన విద్యార్థులు

కప్పరాడ హైస్కూల్: 92 శాతం

కంచరపాలెం: ఐటీఐ జంక్షన్ కప్పరాడ జీవీఎంసీ హైస్కూల్ నుంచి 115 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా.. 106 మంది పాసై 92.17 ఉత్తీర్ణత శాతం సాధించినట్లు హెచ్‌ఎం వి.విజయమాలిని తెలిపారు. ఎస్.యోగేశ్వరి 589 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచిందని చెప్పారు.



శ్రీశాంత్ (575)



బి.హర్షిత (573)



జశ్వంత్‌ను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం రమణికుమారి

గోపాలపట్నం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో
పరీక్ష రాసిన విద్యార్థులు : 249 మంది
ఉత్తీర్ణత సాధించిన వారు : 205 మంది

గోపాలపట్నం జెడ్పీ పాఠశాలలో
పరీక్ష రాసిన విద్యార్థులు : 222 మంది
ఉత్తీర్ణత సాధించిన వారు : 167 మంది

హెచ్‌సీ వెంకటాపురం జెడ్పీ పాఠశాలలో : 56 మంది
ఉత్తీర్ణత సాధించిన వారు : 48 మంది

యల్లపువాని పాలెం జెడ్పీ పాఠశాలలో : 77 మంది
ఉత్తీర్ణత సాధించిన వారు : 73 మంది

కొత్తపాలెం జెడ్పీ పాఠశాలలో : 48 మంది
ఉత్తీర్ణత సాధించిన వారు : 44 మంది

మేహాద్రి గెడ్డ ఏపీ ఉమెన్స్ రెసిడెన్షియల్
జూనియర్ కళాశాలలో : 70 మంది
ఉత్తీర్ణత సాధించిన వారు : 69 మంది

మల్కాపురం జీవీఎంసీ పాఠశాల నుంచి : 118 మంది
ఉత్తీర్ణ సాధించిన వారు : 101 మంది

61వ వార్డు జీవీఎంసీ పాఠశాల నుంచి : 241 మంది
ఉత్తీర్ణత సాధించిన వారు :219

గాంధీగ్రామం జీవీఎంసీ పాఠశాల నుంచి : 70 మంది
ఉత్తీర్ణత సాధించిన వారు : 59 మంది

ఆర్పీపేట ఉన్నత పాఠశాలనుంచి : 148
ఉత్తీర్ణత సాధించిన వారు : 103 మంది

ఆర్పీపేటకు 70 శాతం ఉత్తీర్ణత

అనకాపల్లి భవాని 571/600



కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన టెన్త్ పరీక్ష ఫలితాల్లో జీవీఎంసీ రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలకు 70% ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఏడాది 148 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 103 మంది ఉత్తీర్ణత సాధించారు. 11 విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించినట్టు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. టెన్త్ పరీక్ష ఫలితాల్లో పాఠశాలకు చెందిన అనకాపల్లి భవాని 571/600, వి.జశ్వంత్‌సాయి 547/600, వేదసాయి 546/600, కె.సాత్విక్ 541/600 డి.శ్రావణి 541/600 జి.తిరుమల తేజ్ 539/600, వర్ధన్ 534/600, కె.రోహిత్ 529/600, నరేష్‌కుమార్ 528/600 నవీన్‌కుమార్ 511/600, రేణుక 506/600 మార్కులు సాధించారు. వీరిని ఉపాధ్యాయ సిబ్బంది, పేరెంట్ కమిటీ సభ్యులు అభినందించారు.

ఏరోనాటికల్ ఇంజనీర్ అవుతా



శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాలలో చదువుతూ 582 మార్కులు సాధించడం చాలా ఆనందంగా ఉంది. తండ్రి సన్యాసిరావు భవన నిర్మాణ కార్మికుడు. తల్లి సత్యవతి గృహిణి. అక్క మీన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ప్రభుత్వ పాఠశాల్లో మెరుగైన సౌకర్యాలు, ఉత్తమ బోధన కారణంగా ఎక్కువ మార్కులు సాధించా. భవిష్యత్తులో ఏరోనాటికల్ ఇంజినీర్ కావాలన్నదే లక్ష్యం. బాగా చదువుకుని తల్లిదండ్రులకు ఏ కష్టం రాకుండా చూసుకోవాలన్నదే నా ధ్యేయం.

-ఆర్.లోకేష్ (582 మార్కులు, శ్రీహరిపురం పాఠశాల)

సివిల్స్ నా డ్రీమ్



శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాలలో చదువుతూ పదో తరగతిలో 580 మార్కులు సాధించా. సివిల్స్ చేయాలన్నది నా డ్రీమ్. తండ్రి వెంకటరావు స్థానికంగా ఓ గోదాములో డైలీ లేబర్‌గా, తల్లి ఆదిలక్ష్మి భవన నిర్మాణరంగంలో డైలీ లేబర్‌గా పని చేస్తున్నారు. ఒకరోజు పని ఉంటే మరోక్క రోజు పని తన తండ్రికి ఉండదు. అయినా ప్రభుత్వ పాఠశాలలో చదవడంతో చదువుకు ఆర్థిక భారం తప్పింది. జగన్ మావయ్య వల్ల ఉత్తమంగా చదువుకునే వీలు కలిగింది. అమ్మానాన్నలను బాగా చూసుకోవాలని..వారి కష్టాలు తీర్చాలి.

-జగదీశ్వరి (580 మార్కులు, శ్రీహరిపురం పాఠశాల)

పెరిగిన ఉత్తీర్ణత శాతం



కుమారి (541)



యశ్వంత్(540)



మల్లిక (532)

సింధియా : జీవీఎంసీ 40వ వార్డు పరిధి గాంధీగ్రామం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో మొత్తం 70 మంది పరీక్షలు రాశారు. వీరిలో 59 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 36 మంది మొదటి స్థానంలోనూ, 18 మంది ద్వితీయ స్థానంలోనూ, ఐదుగురు తృతీయ స్థానంలోనూ ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాల మొత్తానికి 541 మార్కులతో రమిశెట్టి కుమారి మొదటి స్థానంలో నిలిచింది. 540 మార్కులతో పెదపూడి యశ్వంత్, 532 మార్కులతో ఎమ్.ఎస్.ఎస్.మల్లిక ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 74 శాతం ఉన్న ఉత్తీర్ణత, ఈ ఏడాది 84 శాతంగా నమోదైందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

భాష్యం విద్యార్థుల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

విశాఖ విద్య: పదో తరగతి ఫలితాల్లో భాష్యం పాఠశాలల ఎన్ఏడీ బ్రాంచి విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. లిఖిత శ్రీ 600 మార్కులకుగాను 592 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. సోమవారంపాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను నిర్వాహకులు అభినందించారు. 550కు పైగా మార్కులను 89 మంది విద్యార్థులు సాధించినట్లు వెల్లడించారు. గణితం, సైన్సు వంటి సబ్జెక్టుల్లోవందలాది మంది విద్యార్థుల వందకు వంద మార్కులుసాధించటం గర్వకారణంగా ఉందన్నారు. ఇందుకు కృషి చేసిన అధ్యాపకులను విద్యాసంస్థల అధినేత రామకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: పదో తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య విద్యా సంస్థల విద్యార్థుల ప్రతిభ చాటినట్లు ఉత్తరాంధ్ర ఏజీఎం సురేష్ తెలిపారు. శ్రీచైతన్య యాజమాన్యం పరిధిలోని స్కూళ్లకు చెందిన విద్యార్థులు శ్రీకర్-597, యస్.అశ్రిత, పల్లి యుదిష్టర్‌లు 596 మార్కులు సాధించినట్లు తెలిపారు. జిల్లాకు చెందిన పాఠశాలల్లో 590కు పైగామార్కులు 61 మంది విద్యార్థులు సాధించారన్నారు. మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన పర్యవేక్షకులు, ప్రిన్సిపాల్స్, అధ్యాకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

రవీంద్రభారతి ఉత్తమ ఫలితాలు



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: పదో తరగతి ఫలితాల్లో రవీంద్ర భారతి పాఠశాలకు చెందిన విద్యార్థి జ్యోతి స్వరూప్‌కు 600కు గాను 595 మార్కులు సాధించినట్లు పాఠశాల చైర్మన్ యం.ఎస్. మణి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన పలువురువిద్యార్థులు అత్యుత్తమమార్కులు సాధించారన్నారు. చైతన్య శ్రీ-590, గుణమిత్ర- 580 మార్కులుసాధించారన్నారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సీజీఎం వసంత, జీఎం. రమ్య, వెంకటేష్, సుధాలత, ప్రిన్సిపాల్ సత్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సమయంలో వచ్చే వారిని ఇంటికి పంపండి

- ప్రజలతో మమేకమయ్యే ఆనంద్‌ను గెలిపించండి
- ఆడారి సోదరి రమాకుమారి పిలుపు



ఓట్లు అభ్యర్థిస్తున్న రమాకుమారి



రమాకుమారిని స్వాగతిస్తున్న మహిళలు

మల్కాపురం: తనను నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ న్యాయం చెయ్యడమే ఆడారి ఆనంద్‌కుమార్ తెలుసునని, మాట ఇచ్చి తప్పడం తెలియదని వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ సోదరి, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి పేర్కొన్నారు. 61వ వార్డు బాపూజీకాలనీ ఏరియాలో సోమవారం వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో డోర్ టూ డోర్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రమాకుమారిని మహిళలు హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ఎన్నికల సమయంలోనే మీ ముందుకొచ్చే నేతలను ఇంటికి పంపండని పిలుపునిచ్చారు. నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల కష్టాల్లో నేనున్నానంటూ ముందుకొచ్చే ఆడారి ఆనంద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఆడారి గెలిస్తే పశ్చిమను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాడని వివరించారు. కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షుడు జీవీఎస్ఎన్‌రాజు (కేబుల్ వాసు)తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన జియ్యాని శ్రీధర్



విద్యార్థులతో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

మల్కాపురం: పదో తరగతి ఫలితాల్లో చక్కటి ప్రతిభ చూపిన విద్యార్థులను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అభినందించారు. డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయం వద్ద సోమ వారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో పదో తరగతి ఫలితాల్లో 600 వందల మార్కులకు గాను 583 మార్కులు సాధించిన సుష్మిత, 550 మార్కులు సాధించిన హర్షితలను ఆయన అభినందించారు.

సేంద్రియ పంటలపై అవగాహన



సేంద్రియ పంటలపై అవగాహన కల్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ

మల్కాపురం: మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ఆవరణలో సేంద్రియ పంట ఉత్పత్తులతో కలిగే లాభాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమ కుమారి పాల్గొని విషపూరిత రసాయనాలతో పంటలు పండించకూడదన్నారు. రైతులు సేంద్రియ పంటలపై దృష్టి సారించే విధంగా విద్యార్థులు వారికి అవగాహన కల్పించాలని సూచించారు.

ఆడారి ఆనంద్‌ను గెలిపించుకుందాం



మాట్లాడుతున్న పిల్లా రమాకుమారి

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు గణపతినగర్-2 ప్రాంతంలో సోమవారం కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ యాదవ్, వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణల ఆధ్వర్యంలో జరిగిన ప్రచార కార్యక్రమానికి యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కూటమితో జతకట్టిన నాయకులు మీ ఇంటికి వచ్చి ఓట్లను అభ్యర్థిస్తారని, కరోనా కష్టకాలంలో మీరెక్కడ దాక్కున్నారని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. విశాఖ పశ్చిమ ఎన్నికల పరిశీలికులు పీలా ఉమారాణి, ట్రేడ్ యూనియన్ ఇండ్రస్టియల్ ఏరియా అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

91వ వార్డులో బెహరా ప్రచారం



విద్యానగర్‌లో ప్రచారం చేస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: పశ్చిమంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ 91వ వార్డు విద్యానగర్, రైల్వే స్టేషన్ రోడ్డులో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రాంతంలో పలు వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి వస్తే ఏవిధంగా అభివృద్ధి, సంక్షేమం ఉండబోతుందో వివరించారు. పశ్చిమ నియోజకవర్గంలో ఆడారి ఆనంద్‌కుమార్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా ఎటువంటి చర్యలు తీసుకున్నారో వివరించారు. పశ్చిమంలో ఆడారి ఆనంద్ కుమార్‌ను, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీరాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గుణిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, గృహ సారథులు, కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.